# జట్టీ

గౌరీశు గొడుగేదె సింహాచలం దొడ్లో దూరి కుడితి తాగేసి పోయింది. సింహాచలం గేదెలకు గోలెంలో ఒక్కచుక్క కుడితి లేదు.

" మళ్లీ యియ్యాలకూడా గౌరీశు గేదె కుడితి తాగేసిపోనాది " అన్నాడు సింహాచం.

సింహాచలం "ఆడంగెదవ" తోస్తే తొంభయి దిక్కుల పడేలా వుంటాడు. ఎప్పుడూ-రేపో మాపో చావబోయేవాడిలాగ దగ్గుతూ చూరవారని- మంచంమీద పడుకుంటాడు. వాడి మొహంలోకి చూస్తే అసలు వీడికి ఎప్పుడైనా యవ్వనం వుందా అని ఆశ్చర్యం కలుగుతుంది. పుట్టు ముసలి వాడేమో అన్న భావం కలగకపోదు. వయసు యాభయ్యేళ్ళకంటే ఎక్కువుండకపోయినా అరవయ్యేళ్ళు పెబడ్డవాడిలా వుంటాడు. ఎప్పుడోగాని పొలానికి వెళ్లడు. ఇంటిదగ్గరే వుండి– గేదెలకు గడ్డివేసినట్టూ. పాలు ఎతికిట్టూ అరాకొరా చిల్లరపన్లు చేస్తుంటాడు. మళ్ళీ-పదిఎకరాల కామందు.!

సింహాచలం పెళ్ళాం దేవుడమ్మ. గుమ్మటంలా వుంటుంది. మొగుడి సరసన నిలబడితే బక్కపక్క నక్క తోడేలు నిలబడ్డట్టుంది. ఎప్పుడూ తోమినతపేలా పచ్చగానూ. నిండుగానూ వుంటుంది. అప్పుడే చెట్టునుంచి తాజాగాదించిన దిబ్బపండులా మాంచి నిగారింపుగానూ తళతళలాడుతూనూ వుంటుంది. నలభయ్యయిదేళ్ళు దాటినా నలభయ్యేళ్ల కూడా నిండనిదానిలా వుంటుంది. కాళ్ళకి కడియాలూ, మెళ్లో కాసులపేరూ, చేతులకి పోతుల్లాంటి గాజులూ- అచ్చం ప్రాణం వచ్చిన పైడితల్లి అమ్మవారి ఉత్సవ విగ్రహంలా వుంటుంది.

"మళ్లీ ఇయ్యాలకూడా గౌరీశు గేద కుడిత్తాగేసి పోనాదే" అన్నాడు సింహాచలం రెండోసారి పెళ్ళాన్నుద్దేశించి.

ఈ సారి వినపడింది. చేస్తున్న పిడకలెక్కడివక్కడే పడేసి రయ్యి రయ్యి మంటూ రథంలా పారొచ్చింది దేవుడమ్మ. తొడ చరిచి జట్టీకి సిద్ధమయింది.

"నీకేం పోయికాలమా. నీకేం మాయ రోగమా. నీ గేదన్నువ్వు కట్టుకోవడం తెల్దా-బాగా వూరోళ్ళ దొడ్లల్లో కుడిత్తాగేసి యిరగ బలిసి పోతంది నీ గేద, ఎండ లొక్కాసి మండిపోతన్నాయి. ఎక్కడా ఒక్క నీటిసుక్క దొరకడంనేదు. గోలెంతో గోలెండు కుడితీ తాగేసి పోయింది. నిన్నూ, నీ గేదనీ అమ్మో రెత్తుకుపోనూ...." ఇలాగా ఏకధాటిగా నిలబెట్టి తిట్లవర్షం కురిపిస్తోంది. దేవుడమ్మ ఘటికాశతదూషణచణ.

కన్నమ్మేమీ తక్కువ తిన్లేదు. పళ్ళు పటపటపటా కొరుకుతూ పటంలా పారొచ్చింది. జబ్బ చరిచి జట్టీకి తయారయిపోయింది.

"ఓల్నోర్ముయ్యే, నాగేదకాడ నీనాగ దొంగబుద్దుల్నేవు. ఆట్టే మాటలు మిగలక వల్లకూరుకో.." అంటూ గాజులు గల గలలాడేలా చేతులు తిప్పుతూ రోడ్డు మీద కొచ్చేసింది.

గౌరీశు నాదారి రైతు ఒక రకంగా బ్రతికి చెడినవాడు. పోయిందిపోగా మొన్న మొన్నటిదాకా ఎకరన్నర పల్లంవుండేది. ఇప్పుడదీ లేదు. గౌరీశు జబ్బు బాగుచేసి బాగుచేసి, మరి బాగుచెయ్యడానికి వల్లగాక ఎకరన్నర పొలం మాత్రం కరగ బెటేసింది కింగ్‌జార్జ్ ఆస్పత్రి. ఒకెకరం శనగ్గుడ్డున్నాదిగాని అందులో పండించడానికి మదుపులు లేక మూడేళ్ళయి కొర్నొగ్గేశాడు. ఆ ముక్క చినుక్కాలంలో పచ్చగడ్డికి తప్ప మరిదేనికీ అక్కరకు రాకుండావుంది. ప్రస్తుతం సొంతానికి ఒక పాకుంది. ఒక బక్కచిక్కిన

గేదెవుంది. అప్పుడప్పుడు గౌరీశు కూలికీ నాలికీ కూడా వెళ్తున్నాడు. కన్నమ్మ సంగతి సరేసరి. ఒకప్పుడు ఒకటోరకం గౌడుగేదెలు రెండుండేవి. జంక్షన్లో టీ కొట్టుండేది. ఒక మూడేళ్ళు బాగానే కాలక్షేపం వెళ్లింది మరి ఫరవాలేదనుకున్నా. కాని క్రమంగా ఆ రెండు గేదెలు పోయాయి. పాలు ఎంతకని కొని టీ కొట్టు నడిపించగలడు? టీ కొట్టు ఎత్తి పెట్టేశాడు.

కన్నమ్మ దగ్గర చిల్లర దొంగతనాలు చేసే గుణం వుందని పేట పేటంతా అనుకుంటారు. పాలల్లో నీళ్లు కలిపి అమ్మడం వల్ల ఎవరన్నా వాడకం పెట్టుకోవడానికి జడుస్తారు. ఇవ్వాళ కన్నమ్మది.... ఎన్ని ఎంగిళ్ళు తిన్నా దినం గడవని బ్రతుకు.

సరిగా వారం రోజుల క్రితం సరిగా యిలాగే జరిగింది. ఆ రోజూ యిలాగే తెలిసి తెలిసీ బుకాయించేసింది. ఇవ్వాళిది రెండోసారి. ఈ సారీ వ్యవహారం అంతసులువుగా తెగేలాలేదు. అరగంటయినా ఎవరికీ నోరు పీకినట్టులేదు.

కన్నమ్మ దేవుడమ్మ రంకులన్నీ ఎత్తి పెట్టింది.

దేవుడమ్మ వయసులో వున్న రోజుల్లో ఓ వెలుగు వెలిగింది. పేటలో మొనగాళ్ళని ఓ వూపు వూపనూ వూపింది. సింహాచలంతో పెళ్ళంటూ అయ్యిందేగాని బొత్తిగా ఎందుకూ కొరగానివాడు. పంచపాండవుల్లాగా అయిదుగురు కొడుకుల్ని కన్నాది. ఆడ సంతానం అంటే లేదు.

దేవుడమ్మకి ఎక్కడలేని రోషమూ ముంచుకొచ్చింది.

"నొరుముయ్యే లమిడీ. ఆటే పేల్నా వంటే పళ్ళు రాలిపోగలవు" అంటూ మహాజోరుగా మీదమీదకి వెళ్ళింది. కన్నమ్మ కన్నాలన్నీ బడటపెట్టింది. నాదారోళ్ళ బతుకుల్లో అన్నీకన్నాలే. కొత్తగా వెదకాలా?

"ఇద్గో - కాపీకొట్టు పేరుజెప్పి మాపిటేళ బీరువాయలమ్మనేదా? ఆశీదేది మేస్త్రబాబు నొట్టుకుని అమ్రికావోడి పాలగుండా. ఉప్మానూక, నూనిడబ్బాలూ సంపాయిచ్చి కాఫీకొట్టు నడిపించనేదా? మాపిటేళ సాని మల్లి యాపారానికి నీ దుకాణం పాకిచ్చి డబ్బులు గంజనేదా? నీ సంగతి నానెరగనా? పెద్దపత్తిత్తులా పేలకు."

ఇరు పక్షాలవారూ మామూలు భాషలోంచి సంస్కృతంలోకి వెళ్ళిపోయారు. పూర్తిగా బూతు పంచాంగాలు విప్పేశారు.

"గయ్యాళిదానికి నోటికి దణ్ణం. గద్దడిదానికి....దణ్ణంఅనీ....తల్లీ నీతో సాలనేం నాయమ్మా." అని దణ్ణంపెట్టేసి. కాండ్రకించి వుమ్మింది కన్నమ్మ. ఆ తుంపుర్లు నిజంగానే దేవుడమ్మమీద తుళ్ళాయి. దేవుడమ్మకి పాల పొంగులా పౌరుషం వచ్చేసింది. పూనకం పట్టినట్టు వూగిపోతూ కన్నమ్మ గూబమీద చాచి లెంపకాయ కొట్టింది. కన్నమ్మకి కళ్ళు బైర్లు కమ్మేశాయి. చెవులు గింగిర్లెత్తిపోయాయి. కొంచెం తేరుకుని– "అమ్మ హెంత దెబ్బకొట్టినావే బాడుకో.." అంటూ "హెచ్చిన భంగపాటుతో" కచ్చా ఎగబోసి ముష్టియుద్ధానికి దిగింది.

దేవుడమ్మ మూడుపూటలా వరికూడు తింటున్నది. కన్నమ్మ ఒక పూట తింటే మాపిటిమాట దేవుడికే ఎరిక- అదయినా చోళ్ళూ గంటెలూనూ- వరన్నం అంటే వైభోగంకిందే లెక్క. దేవుడమ్మే కన్నమ్మని తిరగదోసేసింది. కన్నమ్మ మక్కజారి నేలమీద కుదబడిపోయింది. పడిపోతూ బక్కకోపంతో దేవుడమ్మ జుట్టు భలూకప్పటు పట్టేసింది. దాంతో దేవుడమ్మ అందినచోటల్లా సమ్మెటపోటుల్లాంటి గుద్దులు గుద్దేస్తున్నాది. పేట పేటంతా చేరిపోయారు. ఈ ఆలికిడికి అవతల దొడ్లోంచి గౌరీశు ఒక్క పరుగున పారొచ్చాడు. దేవుడమ్మని వూడదీసిఒక్క తోపుతోశాడు. కన్నమ్మని లేవదీసి ఒక్క గుంజు గుంజి "పదనువ్వింట్లోకి" అంటూలాక్కుపోయాడు పాకలోకి. దేవుడమ్మ అదురుపాటున పడిందేమో కుప్ప

కూలినట్టు కూలి పోయింది. తల బొప్పికట్టింది. మోచేతులు డొక్కుపోయాయి. అంతా క్షణంలో సగంలో జరిగిపోయింది. చూడవచ్చిన జనం చేష్టలుదక్కి నిల్చుండిపోయారు. వాళ్లూవీళ్లూ పోగయి దేవుడమ్మని లేవదీశారు. దేవుడమ్మకి అచ్చంగా పూనకమే పట్టేసింది. సింహాచలం పెళ్లాన్ని సంబాళించబోయాడుగాని, వాడివల్ల కాలేదు.

"వొరె. వోరి గొల్లిగా- నువ్వు నామాద సెయ్యి జేసుకుంటావా- చూస్తాను. నిన్ను సర్వనాసినం జెయ్యకపోతే నాపేరు దేవుడమ్మ కాదు. సూసుకొనాతడాఖా. ఒలే ఓలి కన్నమ్మా! సర్వనాసినం అయిపోనావన్నమాటే! నా తలమీద అప్పన్నున్నాడే- నామీద సెయ్యి జేసుకుంటాడా నీ మొగుడు ఒలే.." దేవుడమ్మ ఉక్రోషం ఉపద్రవంగా వుంది.

దేవుడమ్మ పని కాకిచేత దెబ్బతిన్న రాబందులా వుంది.

సూర్యుడు పడమటి తోపుల్లో క్రుంకి పోతున్నాడు. అవమానం తీవ్ర ప్రతీకారవాంఛగా మారినట్టు- ఎర్రని ఆకాశం నల్లగా మరింత నల్లగా కాటుకలా మారి పోయింది. లోకం అంతా విరబోసుకున్న జుట్టులా నల్లగా చీకటిగా భయంకరంగా బీభత్సంగా వుంది.

పొరుగింటి పార్వతమ్మా, ఎదురింటి వరాలమ్మా వచ్చి కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్న కన్నమ్మని వూరుకోబెడుతున్నారు.

"పల్లకోయే కన్నమ్మా- పేదోళ్ళ కోపం పెదాల సేటే.... ఏడిసినా సచ్చినా మనకెవుళే దిక్కు.... ఆ రోరా లెంచేపు గిర్రున దిరిగి పారిస్తాయే! నిచ్చేపంనాటి గేదపోనాది. ఎవుళో సెడుపెట్టేసినట్టు వుండుండి సచ్చిపోనాది. పోనదలా గయ్యిందంటే ఈ కాసెట్ట గౌరీశుగాడు అల్లా దేవుడమ్మ మీద సెయ్యి జేసుకున్నాడని ఉన్నయ్యీ, లేనియ్యీ పుటిచ్చి కేసుబెట్టి ఆడికెన్నాళ్లోగాని జైలూ నేపోతే అదెంతోగాని జుల్మానాయే యిచ్చారు. నువ్వెక్కడ కట్టగలవే అంతోటి చొమ్మూ" పార్వతమ్మ ఊరడిస్తోంది.

"ఆ దేవుడుతల్లి పెద్దకొడుకు పీడరు గుమాస్తాగదా. ఆడి పేసీలియ్యన్నున్నూ ఆడెంతిదయినా కొత్తిది పీడరు నరుసు పంతులు సారంకాడా" వరాలమ్మది లోతు గుండె. అన్నీ కనిపెడుతునే వుంటుంది. దేవుడమ్మ కొడుకులయిదుగురూ ఏయే దేవుళ్ళ వరప్రసాదాలో స్పష్టంగా వరాలమ్మకి తెలుసును.

కన్నమ్మ కంట నీరు కారుతూనే వుంది. బయట ముసురు.... చితుకూ చితుకూ వాన.... గేదె కుడితి తాగేసిన జట్టీ కడకిలా ఈడ్చికొడుతుందని కన్నమ్మకెలా తెలుస్తుంది? రాబందు దెబ్బకి కోడిపిల్ల గింజుకున్నట్టు గింజుకుంటోంది.

పెద్దవాళ్ళతో జట్టీ ప్రమాదమే- మహా ప్రమాదమే అని- ప్రమాదంలో పడిపోయిందాకా ఎలా తెలుస్తుంది. పేదవాళ్ళకెలా తెలుస్తుంది?

"ఇంక శాన పల్లకో కన్నమ్మా- పల్లకోయే....." అంటున్నాది పార్వతమ్మ.

"ఏడకేడకు- మంగలోరప్పొద్దు.... ఏడ కింక ఏడకూ-" అంటున్నాది వరాలమ్మ.

రచన : 1976
ప్రచురణ : ఆంధ్రజ్యోతి వార పత్రిక, 21-3-80